క్లుప్తంగా

ఆలయానికి ఆకాశ దీపార్చన సామగ్రి సమర్పణ



ఆలయానికి ఆకాశదీప బుట్ట, ఇతర సామగ్రి అందజేస్తున్న దాతలు

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి కార్తీక మాసంలో ఆకాశ దీపార్చనకు సంబంధించిన సామగ్రిని జలుమూరి మోహన్‌రావు, వరలక్ష్మి దంపతులు ఆర్థిక సహకారంతో మంగళవారం ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావుకు అందజేశారు. ఆకాశదీపార్చనకు ఉపయోగించే ఇత్తడి ఆకాశ దీప బుట్ట, నక్షత్ర హారతి స్టాండు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నుంచి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జనవరిలో హైందవ శంఖారావం



సమావేశంలో మాట్లాడుతున్న రామకొండలరావు

మాడుగుల రూరల్: వచ్చే ఏడాది జనవరి 5 న విజయవాడలో జరిగే హైందవ శంఖారావంను విజయవంతం చేయాలని మండల ఖండ కన్వీనర్ రాపేట రామకొండలరావు పేర్కొన్నారు. మంగళవారం కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో చీడికాడ, మాడుగుల, మండలాలకు చెందిన విశ్వ హిందూ పరిషత్ సభ్యులు, మండల కమిటీ అధ్యక్షులతో ఆయన జన సమీకరణకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రతి గ్రామం నుంచి 60 మందికి తక్కువ కాకుండా జనం సమీకరణకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో తవ్వా సన్యాసిశెట్టి, వాలంకి శ్రీనివాసరావు, ఉందూరు శ్రీనివాసరావు, చిరంజీవినాయుడు, పెచ్చెట్టి కొండలరావు పాల్గొన్నారు.

కేజీబీవీకి జిరాక్స్ మిషన్ వితరణ



జిరాక్స్ మిషన్ అందజేస్తున్న సర్వేశ్వరరావు కుటుంబీకులు

మాకవరపాలెం : కేజీబీవీ పాఠశాలకు జిరాక్స్ మిషన్ అందజేశారు. మండల కేంద్రానికి చెందిన పూసర్ల సర్వేశ్వరరావుముని మనుమడు జన్మదినం సందర్భంగా స్థానిక కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు వినియోగించేందుకు మంగళవారం రూ.22,000 విలువ చేసే జిరాక్స్ మిషన్ అందజేశారు. దాతలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో త్రివేణి పాల్గొన్నారు.

రైవాడ జలాశయంలో 4లక్షల చేప పిల్లలు విడుదల నేడు

దేవరాపల్లి : రైవాడ జలాశయంలో చేప పిల్లలను బుధవారం విడుదల చేయనున్నట్టు మత్స్యశాఖ సహాయ అభివృద్ధి అధికారి నాగమణి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా ఉదయం 9 గంటలకు విడుదల చేస్తామన్నారు. చేప పిల్లల పెంపక కేంద్రం నుంచి పలు రకాల 4 లక్షల చేప పిల్లలను తీసుకువచ్చి జలాశయంలో విడుదల చేయనున్నట్టు ఆమె పేర్కొన్నారు. జలాశయంలో చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న వారందరికీ లబ్ధి చేకూరుతుందన్నారు.

ఏఎల్‌పురంలో రెవెన్యూ సదస్సు



రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న మండల సర్వేయర్ సత్యనారాయణ

గొలుగొండ : ఏఎల్‌పురం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సులు కార్యక్రమం నిర్వహించారు. ఏఎల్‌పురం మేజర్ పంచాయతీ కావడంతో రైతులు తమ భూ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. ఇచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్ చేశారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ సత్యనారాయణ, ఆర్ఐ కొండబాబు మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని రైతులకు తెలిపారు.

నెరవేరని జల 'ఆశయం'

- మరమ్మతులకు నోచని రిజర్వాయర్లు
- పూడికతో నిరుపయోగంగా ఉన్న మామిడిపాలెం రిజర్వాయర్
- దెబ్బతిన్న రెండు రిజర్వాయర్ల ప్రధాన గేట్లు
- వృథాగా పోతున్న సాగునీరు
- ఏళ్ల తరబడి రైతులకు తప్పని సాగునీటి కష్టాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

పంట భూములకు సాగు నీరు అందించాల్సిన జలాశయాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఏటా రెండు పంటలకు పుష్కలంగా నీరందించాలనే వీటి లక్ష్యం ఏళ్ల తరబడి నెరవేరడం లేదు. ఫలితంగా ఏటా రెండు వేల ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. మండలంలో ఉన్న మూడు ప్రధాన రిజర్వాయర్లలో ఒక రిజర్వాయర్ పూడిక పేరుకుపోయి నిరుపయోగంగా ఉండగా.. మరో రెండు రిజర్వాయర్ల కాలువలకు లైనింగ్ లేక, గేట్లు మరమ్మతులకు గురయ్యాయి. ఈ పరిస్థితుల్లో భారీ వర్షాలకు చేరిన సాగునీరు వృథాగా పోతోంది. ఈ జలాశయాల పరిస్థితిపై కథనం. – మాకవరపాలెం

గేట్లకు కలగని మోక్షం

రిజర్వాయర్ ప్రాంతం : పాపయ్యపాలెం
పేరు : జాజిగెడ్డ
నిర్మాణం : 1998
రిజర్వాయర్ విస్తీర్ణం : 100 ఎకరాలు
ఆయకట్టు : 800 ఎకరాలు
సాగునీరు అందాల్సిన గ్రామాలు : బూరుగుపాలెం, రామారాయుడుపాలెం, పాపయ్యపాలెం, బుచ్చన్నపాలెం, ముషిడిపాలెం, వెంకటాపురం.
ప్రస్తుత పరిస్థితి : వర్షాలకు రిజర్వాయర్‌లో పుష్కలంగా నీరు చేరినా గేట్లు మరమ్మతులకు గురవ్వడంతో నిత్యం నీరు వృథాగా పోతోంది.

- కాలువకు పూర్తి స్థాయిలో లైనింగ్ లేదు. లైనింగ్ ఉన్న కాలువ ప్రాంతంలో పూడిక పేరుకుపోయింది.
- ఎనిమిదేళ్లుగా ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు.
- 15 ఎకరాల వరకు రిజర్వాయర్ గర్భం ఆక్రమణలకు గురైంది.
- గేట్లు మరమ్మతులకు పలు దఫాలు రూ.లక్షలు వెచ్చించి పనులు చేసినా ప్రయోజనం లేదు.



కాలువ నుంచి వృథాగా పోతున్న సాగునీరు

18 ఏళ్లుగా నిరుపయోగం



పచ్చిక బయలును తలపిస్తున్న మామిడిపాలెం రిజర్వాయర్ గర్భం



పొర్లుకట్టు ఎత్తుకు చేరిన పూడిక

రిజర్వాయర్ ప్రాంతం : మామిడిపాలెం
పేరు : జాజిగెడ్డ
నిర్మాణం : 1975
రిజర్వాయర్ విస్తీర్ణం : 150 ఎకరాలు
ఆయకట్టు : 1,000 ఎకరాలు
సాగునీరు అందాల్సిన గ్రామాలు : అడిగర్లపాలెం, అప్పన్నదొరపాలెం, రామారాయుడుపాలెం, కె.తూటిపాల, మామిడిపాలెం.
ప్రస్తుత పరిస్థితి : 18 ఏళ్లుగా ఈ రిజర్వాయర్ నిరుపయోగంగా ఉంది.

- కొండగెడ్డల నుంచి వచ్చే నీటి ప్రవాహంతో ఇసుక, మట్టి కొట్టుకు వచ్చి రిజర్వాయర్ గర్భంలో చేరింది.
- 12 అడుగుల మేర పూడిక పేరుకుపోవడంతో భారీ వర్షాలు కురిసినా నీరు నిల్వ ఉండడం లేదు.
- కాలువలు కూడా పూడుకుపోయి అధ్వానంగా మారాయి.
- చాలా కాలంగా ఈ రిజర్వాయర్ నిరుపయోగంగా ఉండడంతో సుమారు 40 ఎకరాల వరకు ఆక్రమణలు చేసి పంటలు సాగు చేసుకుంటున్నారు.
- ఆరేళ్ల క్రితం నీరు–చెట్టులో రూ.40 లక్షలు మంజూరైనా పూడిక పనులు పూర్తి స్థాయిలో జరగలేదు.

ప్రారంభం నుంచి అరకొరగానే..



చినరాచపల్లి వద్ద ఊటగెడ్డ రిజర్వాయర్

రిజర్వాయర్ ప్రాంతం : చినరాచపల్లి
పేరు : ఊటగెడ్డ
నిర్మాణం : 2008
రిజర్వాయరు విస్తీర్ణం : 70 ఎకరాలు
ఆయకట్టు : 200 ఎకరాలు
సాగునీరు అందాల్సిన గ్రామాలు : వెంకయ్యపాలెం, చినరాచపల్లి, రామన్నపాలెం, రాచపల్లి, జి.కోడూరు.
ప్రస్తుత పరిస్థితి : ఈ రిజర్వాయర్‌కు ముందుగా ఒక కాలువ మాత్రమే నిర్మించడంతో పూర్తి స్థాయిలో పంట భూములకు నీరు అందేదికాదు

- రైతుల అభ్యర్థన మేరకు రెండో కాలువకు రూ.9లక్షలతో లైనింగ్ పనులు చేశారు.
- కాలువ గేటును నిర్మాణ సమయంలో సక్రమంగా అమర్చకపోవడం వల్ల రిజర్వాయర్‌లో ఉన్న నీరు వృథాగా పోతుంది.
- నీరు –చెట్టులో పూడిక తొలగించినా.. కొండ గెడ్డల నుంచి నీరు వచ్చే గెడ్డలను కప్పివేయడంతో వర్షాలు కురిసినా రిజర్వాయర్‌లోకి నీరు చేరడం లేదు.
- రిజర్వాయర్‌కు సంబంధించిన రెవెన్యూ, ఫారెస్ట్, ఇరిగేషన్ శాఖల పరిధిలోని భూములు ఆక్రమణలకు గురయ్యాయి.

పూడిక తొలగించండి



రిజర్వాయర్‌లో పూడిక తొలగించాలి. గత 18 ఏళ్లుగా మా భూములకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నాం. చేసేది లేక వరి పండే మా భూముల్లో దీర్ఘకాల పంటలు సాగు చేస్తున్నాం.
అడిగర్ల అచ్చియ్యనాయుడు, రైతు, అడిగర్లపాలెం

మరమ్మతులు చేసినా ఫలితం లేదు



పాపయ్యపాలెం రిజర్వాయర్ గేట్లకు అనేక సార్లు మరమ్మతులు చేశారు. రూ.లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేదు. అవసరానికి నీరు లేకుండా వృథాగా పోతుంది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. కణిరెడ్డి పోతురాజు, రైతు, పాపయ్యపాలెం

గేట్లు బాగు చేయాలి



ఊటగెడ్డ రిజర్వాయర్ గేట్లు దెబ్బతిన్నాయి. దీనివల్ల వర్షాలు కురిసినపుడు నీరు చేరినా గేట్లు బాగా లేక వృథాగా పోతుంది. రిజర్వాయర్‌కు చెందిన భూమి ఆక్రమణలకు గురైంది. ఈ ఆక్రమణలు తొలగించాలి.
కూండ్రపు అప్పలనాయుడు, రైతు, వెంకయ్యపాలెం

మెయిన్ రోడ్డు ఆక్రమణ



ఫుట్‌పాత్ దాటి రోడ్డు మీదకు ఏర్పాటు చేసిన దుకాణాలు

నర్సీపట్నం: మెయిన్ రోడ్డు రోజు రోజుకు ఆక్రమణకు గురవుతుంది. విశాలమైన రోడ్డును వ్యాపారులు ఆక్రమించి వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఫుట్‌పాత్ దాటి రోడ్డు మీదకు దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇటు పోలీసులు, అటు మున్సిపల్ అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి. ట్రాఫిక్ ఇబ్బందులను అతిక్రమించేందుకు, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ వంద అడుగుల మేర మెయిన్ రోడ్డును విస్తరించారు. మొదట్లో ఫుట్‌పాత్ అవతల దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకునేవారు. పోలీసు, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఫుట్‌పాత్ దాటి రోడ్డు మీదకు దుకాణాలు ఏర్పాటు చేసుకుని యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో వంద అడుగుల రోడ్డు కుదించుకుపోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మీదకు వేసిన దుకాణాలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం



గౌరీపరమేశ్వరుల మందిరంలో భజనలు

కె.కోటపాడు : కె.కోటపాడు గ్రామంలో గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు నిర్వహించారు. అనుపు పర్వదినం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి ఏటా నాగుల చవితి పర్వదినం రోజున గౌరీ పరమేశ్వరుల అనుపు కార్యక్రమం కె.కోటపాడు గ్రామస్తులు ఘనంగా జరుపుతారు. పలు ప్రధాన వీధుల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కె.జె.పురంలో గౌరీపరమేశ్వర్ల విగ్రహ ప్రతిష్ట



కె.జె.పురంలో గౌరీ పరమేశ్వర్లకు పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామంలో శ్రీ గౌరీపరమేశ్వర్లను మంగళవారం రాత్రి ప్రతిష్ఠించారు. గ్రామంలో శాలిపేట వీధిలో గల బాల వినాయక కమ్యూనిటీ హాలులో ప్రతిష్ఠించిన గౌరీ పరమేశ్వర్లకు 21 రోజుల పాటు పూజలు నిర్వహించి, అనంతరం నిమజ్జనోత్సవం జరుపుతారు. ప్రతి ఏటా నాగుల చవితి పర్వదినం రోజున గౌరీ పరమేశ్వర్లను ప్రతిష్ఠించడం ఆనవాయితీ. ముందుగా గౌరీ పరమేశ్వర్లను పుర వీధుల్లో ఊరేగించారు. గ్రామస్తుల సహకారంతో జరిగే ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావుతో పాటు స్థానిక ప్రజలు, మహిళలు, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వరి చేలకు సుడిదోమ బెడద



మాడుగులలో వరి చేలకు పురుగు మందు పిచికారి చేస్తున్న రైతు

మాడుగుల : ఆరుగాలం కష్టపడి పండించిన వరి చేలు ప్రస్తుతం పొట్టదశకు కొన్ని, పంట దశకు మరికొన్ని చేరుకుంటున్నాయి. ప్రస్తుతం మెట్ట ప్రాంతాల్లో వరి చేలకు సాగునీరు లేక ఎండిపోతున్నాయి. మండలంలో ఖరీఫ్ వరి సాధారణ విస్తీర్ణం 10,500 ఎకరాలు కాగా ఈ ఏడాది 12 వేల ఎకరాల్లో సాగు చేశారు. పంట చేతికి అందుతున్న తరుణంలో వర్షాలు లేకపోవడంతో పాటు తెగుళ్లు ఆశిస్తున్నాయని, దీని వల్ల దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. పెట్టుబడులు అధికంగా ఉండడం వల్ల ఈ ఏడాది గత ఏడాది కటే ఎక్కువ మద్దతు ధరలు పెంచాలని, కొనుగోలు కేంద్రాలు పంట కోసే సమయానికి ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ మృతికి సంతాపం



పెదగోగాడలో రెడ్డి సత్యనారాయణ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

మాడుగుల రూరల్ : మాజీ మంత్రి, మాడుగుల నియోజకవర్గం నుంచి ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసిన రెడ్డి సత్యనారాయణ (సత్యం మాస్టర్) మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం తెలిపారు. ఆయన స్వగ్రామం అయిన పెద గోగాడ గ్రామంలో మంగళవారం మాస్టారు భౌతిక కాయాన్ని మండలంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ, బీజేపీ, జనసేన, సీపీఎం పార్టీలకు చెందిన నాయకులు, ప్రజా ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ మృతి పట్ల బీజేపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుట్టా రాంబాబు, సీనియర్ నాయకులు పుట్టా మల్లికార్జునరావు, పార్టీ మండల నాయకులు మద్దాల రమణ, గొల్లవిల్లి రాజేష్‌తో పాటు పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సాలాపు వీరునాయుడు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు



మాట్లాడుతున్న డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీకి 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైందని ఏపీఈపీడీసీఎల్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.67.35 కోట్లు విడుదల చేసిందన్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను వర్చువల్ విధానంలో ఈ నెల 7వ తేదీన సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణంతో నిరంతర విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ డీఈ త్రినాథరావు ఉన్నారు.

తాగునీటి బోరు బాగు చేయరూ..

మాడుగుల : స్థానిక ఉబ్బ లింగేశ్వరాలయం ప్రాంగణంలో తాగునీటి బోరు మరమ్మతుకు గురయింది. దీంతో కార్తీక మాసంలో శివాలయాలకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతం పిక్నిక్ స్పాట్ కావడంతో తాగునీటి బోరుకు మరమ్మతులు చేయాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయమై సర్పంచ్ ఎడ్ల కళావతిని సంప్రదించగా వెంటనే తాగు నీటి బోరు మరమ్మతులు చేపడతామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నాగేంద్రునికి పూజలు



దేవరాపల్లి : తారువలో నాగేంద్రునికి పూజలు చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



మాడుగుల రూరల్ : కె.జె.పురంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



నర్సీపట్నం : కుటుంబ సభ్యులతో కలిసి పుట్ట వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

మాడుగుల, చోడవరం, నర్సీపట్నం నెట్‌వర్క్ : నాగుల చవితి సందర్భంగా మంగళవారం వాడవాడలా భక్తులు పుట్టల వద్ద నాగేంద్రుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రైతులు కుటుంబ సమేతంగా తలంటు స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి పశువుల పాకల వద్ద, పంట పొలాల గట్ల వద్ద పుట్టలను అందంగా అలంకరించి వెళ్లి పండ్లు పూలతో నాగేంద్రుడిని పూజించారు. ఇలా నాగ దేవతలను పూజించడం వల్ల రాత్రనక పగలనక పొలాలుకు వెళ్లిన రైతులకు నాగ జాతి వల్ల ప్రమాదాలు తప్పుతాయని ఈ ప్రాంత రైతులు విశ్వాసం. ప్రతి ఇంటి నుంచి కుటుంబ సమేతంగా పుట్టల వద్దకు వెళ్లి పాలు, గుడ్లు, నువ్వుల చలిమిడి, తాటి గుజ్జు, పండ్లు, పూలు సమర్పించి పుట్ట పూజ చేశారు. అనంతరం పుట్ట వద్ద బాణా సంచా కాల్చి సందడి చేశారు. పలు గ్రామాల్లో భక్తులు పుట్టల వద్దే వంటలు చేసుకుని అక్కడే కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు.

తారువలో మాజీ డిప్యూటీ సీఎం పూజలు

దేవరాపల్లి మండలం తారువలో మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు కుటుంబ సభ్యులతో కలిసి నాగుల చవితి వేడుకలను జరుపుకొన్నారు. ఎ.కొత్తపల్లిలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, వెంకటరమణ దంపతులు, మామిడిపల్లిలో జెడ్పీటీసీ కర్రి సత్యం, బోయిలకింతాడలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు నాగేంద్రునికి పుట్ట వద్ద పూజ చేశారు.

- కె.కోటపాడు మండలంలో కె.కోటపాడు చౌడువాడ, గొండుపాలెం తదితర గ్రామాల్లో నాగుల చవితి సందర్భంగా రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కేజేపురంలో కరణం ధర్మశ్రీ పూజలు

- మాడుగుల మండలం కె.జె.పురంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కుటుంబ సభ్యులతో కలిసి నాగేంద్రునికి పూజలు చేశారు.
- రోలుగుంట మండలం కొవ్వూరు మలసాల వారి పాకల వద్ద తయారు చేసుకున్న పుట్ట వద్ద ఆయా కుటుంబాలు వారు ఒకే చోట సామూహికంగా పుట్టలో పాలు పోసి బాణసంచా కాల్చి వేడుకలు జరిపారు.
- బుచ్చెయ్యపేట మండలంలో పలు గ్రామాల్లో భక్తులు పుట్టల వద్ద తమ కుటుంబ సభ్యులకు తల నీలాలు తీయించి పుట్టల వద్దే సహపంక్తి భోజనాలు చేశారు.

మాజీ ఎమ్మెల్యే గణేష్ పూజలు

- నర్సీపట్నంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి సమీపంలో పొలాల్లోని పుట్టవద్ద పూజలు చేసి, నాగులచవితి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. నాగేంద్రునికి ప్రీతికరమైన పాలు, గుడ్లు, చిమ్మిడి నైవేద్యంగా సమర్పించారు.

చోడవరం : చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు చోడవరం కోటవీధిలో కుటుంబ సభ్యులతో కలిసి పుట్టలో పాలుపోశారు. అదేవిధంగా చోడవరం మండలం బంగారమ్మపాలెం వద్ద ఉన్న ప్రత్యేక పుట్టలో పాలుపోసేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.



కె.కోటపాడు : చౌడువాడలో నాగుల చవితి వేడుకలు



నాతవరం : చమ్మచింతలో పుట్ట వద్ద భక్తుల పూజలు



మాకవరపాలెంలో నాగుల చవితి పూజలు



గొలుగొండలో పుట్టలో పాలు పోయడానికి వచ్చిన భక్తులు



మాడుగులలో పుట్ట వద్ద కుటుంబ సమేతంగా భక్తుల పూజలు



బుచ్చెయ్యపేట : పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



రోలుగుంట : పుట్టలో పాలు పోసి పూజలు చేసుకుంటున్న భక్తులు